పట్టణానికి దూరం.. వసతులు శూన్యం

- అభివృద్ధికి నోచుకోని గొల్లగడ్డతండా, ఏకలవ్యకాలనీ
- అండర్‌పాస్‌తోనూ తప్పని ఇబ్బందులు

వార్డు 13
జనాభా 5,770
ప్రధాన వీధులు: బండమీదిపల్లి (కొంత భాగం), బుడగ జంగం కాలనీ, పోచమ్మ కాలనీ–వడ్డెరబస్తీ, రాజీవ్ గృహకల్ప, గొల్లగడ్డతండా, ఏకలవ్యకాలనీ, పాలిటెక్నిక్ కాలేజీ ఏరియా.


డ్రెయినేజీ లేక పోచమ్మకాలనీ-వడ్డెర బస్తీలో ఇళ్ల మధ్య పారుతున్న మురుగు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక 13వ వార్డులో సమస్యలు తాండవం చేస్తున్నాయి. బండమీదిపల్లిలోని సీసీ రోడ్లపై గతంలో మిషన్‌భగీరథ పథకం పైపులైన్ కోసం తవ్విన గుంతలు సరిగా పూడ్చలేదు. వారం రోజులకోసారి డ్రెయినేజీలు, రోడ్లను పారిశుద్ధ్య కార్మికులు శుభ్రం చేస్తున్నారని స్థానికులు తెలిపారు. బ్యాంకర్స్ కాలనీలో సీసీ రోడ్లు, డ్రెయినేజీ, మిషన్ భగీరథ పైపులైన్ పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయలేదని ప్రజలు వాపోతున్నారు. అల్లీపూర్ రోడ్డుకు ఎడమ వైపు ఉన్న గుట్ట ప్రాంతంలోని బుడగజంగం కాలనీలో ఆరుచోట్ల మట్టిరోడ్లే శరణ్యమయ్యాయి. డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగంతా కిందికి మెయిన్‌రోడ్డు వద్దకు వచ్చి మడుగులా తయారైంది. పది స్తంభాలకు వీధి దీపాలు ఏర్పాటు చేయలేదు. పోచమ్మకాలనీ–వడ్డెరబస్తీలో సుమారు నాలుగేళ్లుగా ఓవర్ హెడ్ నీటిట్యాంకును వృథాగా వదిలేశారు. ఇక్కడ సుమారు వంద ఇళ్లు ఉంటాయి. ఒకే సీసీరోడ్డు తప్పా గల్లీల్లో మట్టిరోడ్లే గతి. మోరీలు లేకపోవడంతో చుట్టుపక్కల మురుగు ఏరులై పారుతోంది. మిషన్ భగీరథ తాగునీరు సరిపోవడం లేదని, తరచూ కలుషితం అవుతోందన్నారు. రాజీవ్‌గృహకల్పలో 380 కుటుంబాలు నివసిస్తున్నాయి. పందులు, కుక్కల బెడద ఉందని కాలనీవాసులు చెబుతున్నారు. రైల్వేట్రాక్ అవతల గొల్లగడ్డతండా, ఏకలవ్యకాలనీ కిలోమీటరు దూరంలో ఉన్నాయి. కోడూరు నుంచి సింగిల్‌ఫేజ్ విద్యుత్ సరఫరా అవుతోందని తండావాసులు తెలిపారు. ఈదురుగాలులు వీచినప్పుడు తీగలు తెగి రెండు మూడు రోజులు నిలిచిపోతుందన్నారు. పాలిటెక్నిక్ కాలేజీ ఏరియా నుంచి తండా వరకు ఉన్న సీసీ, బీటీరోడ్డు పలుచోట్ల దెబ్బతింది. మరోవైపు వీధి దీపాలు లేకపోవడంతో రాత్రివేళ ఈ దారి వెంట వెళ్తున్న మహిళలను తరచూ పోకిరీలు అటకాయిస్తూ ఇబ్బందుల పాలు చేస్తున్నారని తండావాసులు ఆరోపిస్తున్నారు. ఏకలవ్యకాలనీలో మూడు, నాలుగు రోజులకోసారి తాగునీరు వస్తోందని, నిల్వ చేసుకునే సౌకర్యం లేదని వాపోతున్నారు. సీసీరోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాన్ని తొలగించి, మరో మూడు కొత్తవి ఏర్పాటు చేయాలన్నారు. సింగిల్ ఫేజ్ కారణంగా ఇళ్లలో తరచూ బల్బులు కాలిపోతున్నాయన్నారు. పాలిటెక్నిక్ కాలేజీ ఏరియాలో మురుగు ఎక్కడికక్కడే నిలిచిపోతోంది. దుర్గంధం వెదజల్లడంతో రోగాల బారిన పడుతున్నామని చెబుతున్నారు.

అండర్‌పాస్ దాటాల్సిందే..

మెయిన్ రోడ్డు నుంచి అండర్‌పాస్ ద్వారానే పాలిటెక్నిక్ కాలేజీ ఏరియా, ఏకలవ్యకాలనీ, గొల్లగడ్డతండా వెళ్లాలి. ఇది తప్పా మరో మార్గం లేదు. వర్షాకాలంలో అండర్‌పాస్ నిండా నడుములోతు వరద నీరు చేరడంతో ఈ మూడు కాలనీవాసుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయి. రోజుల తరబడి పట్టణానికి రాలేని పరిస్థితి నెలకొంటుంది. రాత్రివేళ అంతా చీకటిమయమే. అండర్ పాస్‌కు అటు, ఇటు విద్యుత్ స్తంభాలతో పాటు వీధిదీపాలు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.


బండమీదిపల్లిలోని బ్యాంకర్స్‌కాలనీలో ఉన్న మట్టి రోడ్డు

సమస్యలు పరిష్కరించాలి



సుమారు 40ఏళ్ల కిందటే డీటీసీపీ లే–అవుట్ ప్రకారం మా కాలనీ వెలిసింది. అయినా మట్టిరోడ్లే శరణ్యం. డ్రెయినేజీలు నిర్మించలేదు. గల్లీల్లో మిషన్ భగీరథ పథకం పైపులైన్ పూర్తిగా వేయలేదు. ఇంటికి కొళాయి కనెక్షన్ తీసుకోవాలంటే మెయిన్ లైన్ వరకు సొంతంగా పైపులు బిగించాల్సి వస్తోంది. కొత్తగా నిర్మించిన పార్కును వెంటనే ప్రారంభించాలి.

– బుచ్చియాదవ్, బ్యాంకర్స్‌కాలనీ, బండమీదిపల్లి

గాలి వీస్తే కరెంట్ పోతుంది..



మా తండాకు ఎంతో దూరంలో ఉన్న కోడూరు నుంచి విద్యుత్ లైన్ వేయడం వల్ల తరచూ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. పెద్ద గాలి వీస్తే చాలు స్తంభాలకున్న వైర్లు మధ్యలోనే తెగి కరెంట్ పోతుంది. ఈ దారిలో రాత్రి వేళ మహిళలు వెళ్లాలంటేనే భయపడుతున్నారు.

– దేవమ్మ, వ్యవసాయ కూలీ, గొల్లగడ్డతండా

రూ.3 కోట్లతో పనులు చేపట్టాం..



ఈ మూడేళ్లలో రూ.3కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టాం. పోచమ్మకాలనీ, బుడగ జంగం కాలనీలలో సీసీరోడ్లు, డ్రెయినేజీకి రూ.20 లక్షలు మంజూరయ్యాయి. ఇటీవలే ఏకలవ్యకాలనీలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పర్యటించి సమస్యలు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అండర్‌పాస్ సమస్యను దక్షిణమధ్య రైల్వే అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. బండమీదిపల్లి మెయిన్‌చౌరస్తాలో 4సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం.

– జి.లక్ష్మీదేవి, కౌన్సిలర్, 13వ వార్డు

సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం


జడ్చర్లలో పాలాభిషేకం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

జడ్చర్ల: హైదరాబాద్‌లో 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసినందుకు శనివారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో జెడ్పీ వైస్ చైర్మన్ యాదయ్య ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ నాయకులు సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, నాయకులు జంగయ్య, రఘుపతిరెడ్డి, రమేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

భూత్పూర్: పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద శనివారం సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి చిత్రపటాలకు బీఆర్‌ఎస్ నాయకులు పాలాభిషేకం హైదరాబాద్‌లో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేసిన సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బస్వరాజ్ గౌడ్, నాయకులు నారాయణ గౌడ్, ఎమ్మార్పీఎస్ టీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లెపోగు శ్రీనివాస్, నాయకులు మురళీధర్ గౌడ్, రాములు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం

దేవరకద్ర: మండలంలోని గూరకొండలో శనివారం సాయంత్రం ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. సెల్‌ఫోన్ల వాడకంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ఓటీపీలు వస్తే ఎవరికీ చెప్పరాదని ఎస్‌ఐ వెంకటేష్ తెలిపారు. బ్యాంకుల్లో దాచుకున్న డబ్బులను కొట్టేయడానికి సైబర్ నేరాగాళ్లు వివిధ రకాలుగా ప్రయత్నిస్తారని అన్నారు. బ్యాంకు ఖాతా నంబర్లను ఎవరికీ ఇవ్వరాదని సూచించారు.

క్లుప్తంగా

సదరం క్యాంపును సద్వినియోగం చేసుకోండి

భూత్పూర్: జిల్లా జనరల్ ఆస్పత్రిలో ఈనెల 26వరకు సదరం క్యాంపు ఉంటుందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ మున్నీ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రత్యేక అవసరాలు కలిగిన వారు (దివ్యాంగులు) 18, 19, 25, 26 తేదీల్లో జిల్లా జనరల్ ఆస్పత్రిలో సదరం క్యాంపు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

నేడు మోడల్‌స్కూల్ ప్రవేశ పరీక్ష

గండేడ్: మండలంలోని వెన్నాచేడ్ మోడల్ స్కూల్‌లో చేరేందుకు ప్రవేశ పరీక్ష ఆదివారం నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కొండల్‌రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10నుంచి 12గంటల వరకు 6వ తరగతిలో ప్రవేశం కోసం పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం 2నుంచి 4గంటల వరకు 7వ తరగతి నుంచి పదో తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్ల కోసం పరీక్షలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

ఏఓగా ఉమాకాంత్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక మున్సిపాలిటీలో కొత్త అకౌంట్స్ ఆఫీసర్ (ఏఓ)గా వై.ఉమాకాంత్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన సంగారెడ్డి మున్సిపాలిటీలో గ్రేడ్–2 జూనియర్ అకౌంటెంట్‌గా పనిచేసి పదోన్నతి (గ్రేడ్–1)పై మహబూబ్‌నగర్‌కు వచ్చారు. ఇక్కడ అదే హోదాలో పనిచేసిన శిరీష ఖమ్మం కార్పొరేషన్‌కు బదిలీపై వెళ్లారు.

చలివేంద్రం ప్రారంభం



దేవరకద్ర: స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద శనివారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. మండల పరిషత్, ఇతర ప్రభుత్వ కార్యాలయాలు ఉండడంతో వివిధ పనుల నిమిత్తం ప్రజలు ఇక్కడికి వస్తుంటారు. వేసవి ఎండలు మండిపోతుండడంతో ప్రజలకు తాగునీటిని అందించాలనే ఉద్దేశ్యంతో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. తహసీల్దార్ జ్యోతి, డిప్యూటీ తహసీల్దార్ శివరాజు, ఎస్‌ఐ వెంకటేశ్, పీఏసీఎస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

గార్లపహాడ్‌ను మండలంగా ప్రకటించండి



కోయిల్‌కొండ: గార్లపహాడ్‌ను మండలంగా ప్రకటించే వరకు రిలే నిరాహార దీక్షలు కొనసాగిస్తామని మండల జేఏసీ కోకన్వీనర్ వెంకట్రామిరెడ్డి అన్నారు. శనివారం మండలంలో గార్లపహాడ్ గేటు వద్ద 84వ రోజు రిలేదీక్షలు కొనసాగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 12గ్రామాల ప్రజలు గార్లపహాడ్‌ను మండలంగా ప్రకటించాలని కోరుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆయన మండిపడ్డారు. ప్రభుత్వం వెంటనే స్పందించి గార్లపహాడ్‌ను మండలంగా ప్రకటించాలని కోరారు.

దళితరత్న అవార్డు



మహబూబ్‌నగర్ న్యూటౌన్: జాతి అభివృద్ధి కోసం అహర్నిషలు కృషి చేస్తున్న మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు బ్యాగరి చెన్నయ్యకు దళితరత్న అవార్డు అందజేశారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో డా.బీఆర్.అంబేడ్కర్ జయంతి ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన సమావేశంలో అవార్డును అందజేశారు. సోషల్ వెల్ఫేర్ జాయింట్ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య, ఉత్సవ కమిటీ చైర్‌పర్సన్ జంగ శ్రీనివాస్, మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి శ్రీధర్‌రావు, జిల్లా అధ్యక్షుడు రమేష్ చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు.

జానంపేటలో బైక్ చోరీ

అడ్డాకుల: మూసాపేట మండలం జానంపేటలో ద్విచక్రవాహనాన్ని గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారు. మూసాపేట ఎస్‌ఐ విజయభాస్కర్ కథనం ప్రకారం.. జానంపేటకు చెందిన వెంకటేష్ తన ద్విచక్రవాహనాన్ని శుక్రవారం రాత్రి ఇంటి వద్ద నిలిపాడు. అర్ధరాత్రి తర్వాత గుర్తు తెలియని దొంగలు మరో బైక్‌పై వచ్చి వెంకటేష్‌కు చెందిన గ్లామర్ బైక్‌ను ఎత్తుకెళ్లారు. అయితే వారు తెచ్చిన బైక్‌ను అక్కడే వదిలేసి వెళ్లారు. శనివారం ఉదయం బైక్ చోరీకి గురైందన్న విషయాన్ని గుర్తించిన బాధితుడు మూసాపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో దొంగలు వదిలి వెళ్లిన బైక్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ విజయభాస్కర్ తెలిపారు. ఇదిలా, ఉండగా దొంగలు వదిలి వెళ్లిన బైక్ కూడా దొంగిలించినదేనని తెలుస్తోంది. కాగా, జానంపేటలో మరో ఇద్దరి బైక్‌లను ఎత్తుకెళ్లడానికి దొంగలు యత్నించినట్లు తెలిసింది.

జాగ్రత్తలతో ప్రమాదాలను నివారించవచ్చు


జిల్లా కేంద్రంలో అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక శాఖ అధికారులు

మహబూబ్‌నగర్ క్రైం: ఇళ్లలో, దుకాణాలు, ఆస్పత్రులు ఏ చోట అయినా చిన్నపాటి జాగ్రత్తలు పాటిస్తే అగ్ని ప్రమాదాలు నివారించే అవకాశం ఉందని జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి సుధాకర్ అన్నారు. అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో అగ్ని ప్రమాదాల వారోత్సవాల సందర్భంగా శనివారం జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. గ్యాస్ సిలిండర్ ద్వారా ఏర్పడే ప్రమాదాలను ఎలా అదుపు చేయాలో వివరించారు. పెట్రోల్ ద్వారా జరిగే అగ్ని ప్రమాదాలను ఎలా అదుపు చేయాలో ప్రాక్టికల్‌గా చేసి చూపించారు. అనంతరం డీఎఫ్‌ఓ సుధాకర్ మాట్లాడుతూ అగ్నిప్రమాద వారోత్సవాల సందర్భంగా జిల్లాలో ఆస్పత్రులు, పాఠశాలలు, గ్యాస్ గోదాంలు, హోటల్స్ తదితర ప్రాంతాల్లో అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఎండలు అధికంగా ఉన్న సమయంలో షార్ట్ సర్క్యూట్‌తో కూడా ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. పల్లెల్లో గడ్డివాములు, పూరిగుడిసె ఇళ్లు కల్గిన వారు జాగ్రత్తగా ఉండాలన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే 101కు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఫైర్ ఆఫీసర్ మల్లికార్జున్, పద్మయ్య పాల్గొన్నారు.

జడ్చర్ల టౌన్: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శనివారం మండల ఫైర్‌స్టేషన్ అధికారి మల్లికార్జున్ నేతృత్వంలో సిబ్బంది బస్టాండ్‌లో ప్రయాణికులు, ఆర్టీసీ ఉద్యోగులు, స్టాల్స్ యజమానులకు అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పించారు. ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలిపారు. అకస్మాత్తుగా ప్రమాదాలు జరిగితే ఏ విధంగా నివారించాలో వివరించారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది నవీన్‌కుమార్, రాజేందర్ నాయక్, రవికుమార్, వెంకటయ్య, కైఫ్, ఆంజనేయులు పాల్గొన్నారు.

ర్యాలీని విజయవంతం చేయండి

మహబూబ్‌నగర్ న్యూటౌన్: సీపీఎస్ కాన్‌స్టిట్యూషనల్ ర్యాలీని విజయవంతం చేయాలని సీపీఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు సనాతన బాలస్వామి పిలుపునిచ్చారు. శనివారం జిల్లా కేంద్రంలోని జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో ఉద్యోగుల ఆధ్వర్యంలో ర్యాలీ కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చనిపోయిన సీపీఎస్ కుటుంబాలు, రిటైర్డ్ అయిన కుటుంబాలెన్నో రోడ్డున పడ్డాయని, వెంటనే సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 16న జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహం నుంచి ఉదయం 9:30 గంటలకు ప్రారంభమై ఎర్రసత్యం చౌరస్తామీదుగా అంబేడ్కర్ చౌరస్తా వరకు చేరుకొని అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసి నిరసన వ్యక్తం చేయనున్నట్లు పేర్కొన్నారు. ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో సబ్‌రిజిస్ట్రార్ అంజనేయులు, ఉద్యోగులు అచల, జమీరుద్దీన్, సరస్వతమ్మ, రియాజ్, శ్రీనివాసులు, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.


జిల్లా కేంద్రంలో కరపత్రాలు విడుదల చేస్తున్న ఉద్యోగులు

హన్వాడ: పెన్షన్ కాన్స్టిట్యూషనల్ మార్చ్‌ను విజయవంతం చేయాలని మండల కేంద్రంలో కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా పెన్షన్ సాధన కమిటీ జిల్లా కార్యదర్శి కేఎం చంద్రకాంత్ మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే స్పందించి పాత పెన్షన్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ బక్క శ్రీనివాసులు, ఎంపీడీఓ ధనుంజయ్, జిల్లా బాధ్యులు మల్లేష్, ఖాదర్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి

భూత్పూర్: కుల, మత, జాతి బేదం లేకుండా అన్ని వర్గాల అభ్యున్నతికి సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో రంజాన్ సందర్భంగా పేద ముస్లింలకు రంజాన్ తోఫా, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులతో పాటు దళితబంధు పథకం లబ్ధిదారులకు వాహనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా సీఎం కేసీఆర్ అభివృద్ధిని తెలంగాణను అగ్రగామిగా నిలిపారని పేర్కొన్నారు. నియోజవర్గంలో 65వేల మంది రైతులకు గాను రూ.900కోట్లు రైతుబంధు కింద ఇచ్చినట్లు తెలిపారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ తదితర అభివృద్ధి ఫలాలను ప్రజలకు అందిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బస్వరాజ్ గౌడ్, ఎంపీపీ కదిరె శేఖర్ రెడ్డి, వైస్ ఎంపీపీ నరేష్ గౌడ్, నాయకులు నారాయణ గౌడ్, మత్స్య సహకార సంఘం జిల్లా అధ్యక్షుడు నారాయణ, రైతుబంధు మండల అధ్యక్షుడు నర్సింహులు గౌడ్, తహసీల్దార్ చెన్న కిష్టన్న, కమిషనర్ నజీబ్, ఎంపీడీఓ మున్నీ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ..

అడ్డాకుల: మూసాపేట మండలం నిజాలాపూర్‌కు చెందిన సగర సంఘం అధ్యక్షుడు, రైతుబంధు సమితి గ్రామ అధ్యక్షుడు భీమయ్యసాగర్ మృతి పట్ల శనివారం అన్నాసాగర్‌లో ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. కాశీకి వెళ్లి తిరిగొచ్చే సమయంలో మృతిచెందడం బాధాకరమని, వారి కుటుంబానికి అండగా ఉంటానని తెలిపారు. సంతాపం తెలిపిన వారిలో జెడ్పీటీసీ జి.ఇంద్రయ్యసాగర్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు లక్ష్మీనర్సింహయాదవ్, సింగిల్ విండో అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, నాయకులు కొండయ్య, రఘుపతిరెడ్డి, వెంకటయ్య, మశ్చందర్‌నాథ్ ఉన్నారు.

ఏకకాలంలో రుణమాఫీ

మహబూబ్‌నగర్ రూరల్: రాష్ట్రంలో వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి అధికారం ఇస్తే ఏకకాలంలో రూ.2లక్షల రైతు రుణమాఫీ చేస్తామని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సంజీవ్ ముదిరాజ్ అన్నారు. శనివారం మండలంలోని చౌదర్‌పల్లిలో ఇంటింటికీ కాంగ్రెస్ కార్యక్రమంలో భాగంగా గ్రామంలో పర్యటించి కాంగ్రెస్ చేసిన అభివృద్ధి కార్యక్రమాల గురించి ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పాలనలో అవినీతి, అక్రమాలే తప్పా ప్రజలకు చేసిందేమీ లేదని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ఇందిరమ్మ ఇళ్ల పథకంలో ప్రతి ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా రూ.5లక్షల వరకు ఉచిత వైద్యం, ఇంట్లో ఇద్దరికి కనీస పెన్షన్ రూ.5వేలు, గ్యాస్ సిలిండర్ రూ.500లకే ఇస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మల్లు నర్సింహారెడ్డి, నాయకులు సిరాజ్‌ఖాద్రీ, బెక్కరి అనిత, సుధాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, రామచంద్రయ్య పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణపై సమీక్ష

జడ్చర్ల టౌన్: ఇళ్లస్థలాల క్రమబద్ధీకరణ జీఓలు 58, 59లపై శనివారం మున్సిపాలిటీ కార్యాలయంలో మీ సేవ నిర్వాహకులతో చైర్‌పర్సన్ దోరేపల్లి లక్ష్మి, కమిషనర్ మహమూద్‌షేక్ సమీక్ష నిర్వహించారు. ఈ నెల 1నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైనందునా వాటిని ఎలా స్వీకరిస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. స్వీకరణలో ఎదురవుతున్న సమస్యలను అడిగారు. వార్డు అధికారులు దరఖాస్తులు ఇచ్చి పంపిస్తున్నారని, అలా కాకుండా వాటితో జత చేయాల్సిన ధ్రువపత్రాల గురించి అవగాహన కల్పించి పంపించేలా చూడాలని మీసేవ నిర్వాహకులు చైర్‌పర్సన్, కమిషనర్ల దృష్టికి తీసుకువచ్చారు.

ఆలయ వార్షికోత్సవం



స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలోని గణేష్‌నగర్‌లో షిరిడీ సాయిబాబా ఆలయ 15వ వార్షికోత్సవ వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. శనివారం స్వామివారి సుప్రభాత సేవ, పుణ్యహావాచనం, అఖండ దీపారాధన, మండపారాధన, హోమం తదితర పూజలు చేపట్టారు. ఆదివారం 21 కలశాలతో కాగడ హారతి, పంచామృతాభిషేకం, మంత్ర హవనములు, కుంబాభిషేకం, పూర్ణాహుతి, శికరాభిషేకం పూజలు నిర్వహించనున్నారు.

కందూర్‌లో ఇఫ్తార్



అడ్డాకుల: మండలంలోని కందూర్‌లో శనివారం రాత్రి ముస్లింలకు గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు దేవేందర్‌రెడ్డి ఇఫ్తార్ ఏర్పాటు చేశారు. ముస్లింలకు పండ్లను తినిపించి ఉపవాస దీక్షలను విరమింపజేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ రమేష్‌గౌడ్, నాయకులు దండు కృష్ణారెడ్డి, శ్రీనివాస్‌యాదవ్, అన్వర్, సాధిక్, బాబా, మహ్మద్ ఉన్నారు.

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని శనివారం స్థానిక టీచర్స్‌కాలనీలోని లుంబినీ హైస్కూల్‌లో ఇఫ్తార్ వితరణ చేపట్టారు. విద్యార్థులకు వివిధ ఫలాలతో కూడిన ప్యాకెట్లు అందజేశారు. పాఠశాల డైరెక్టర్ కె.లక్ష్మణ్‌గౌడ్, ప్రిన్సిపాల్ శ్వేతాసింగ్, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ సారా మారియం, మానసిక నిపుణులు మసూద్‌అలీఖాన్, ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతాం

నవాబుపేట: మండలంలో లింగంపల్లి గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని జెడ్పీటీసీల సంఘం జిల్లా అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ నర్సింహులు, ఎంపీపీ అనంతయ్య, మార్కెట్ చైర్మన్ లక్ష్మయ్య అన్నారు. శనివారం మండలంలోని లింగంపల్లిలో దాదాపుగా రూ.కోటికి పైగా వ్యయంతో అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. రూ.20లక్షలతో గ్రామ పంచాయతీ భవన నిర్మాణం, రూ.20లక్షలతో హెల్త్ సబ్‌సెంటర్, రూ.42లక్షలతో పాఠశాల ఆదనపు గదులు, రూ.19లక్షలతో మహిళా సమాఖ్య భవనం, రూ.10లక్షలతో అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ పనులు గ్రామంలో చేపడుతున్నట్లు తెలిపారు. నిధులు కేటాయించిన ఎంపీ, ఎమ్మెల్యేలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సంతోష్‌రెడ్డి, ముడా డైరెక్టర్ చెన్నయ్య, మాజీ ఎంపీపీ శ్రీనివాస్, ఉపసర్పంచ్ పద్మరెడ్డి, ఏఈ రాములు, శాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.


అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న ప్రజాప్రతినిధులు

పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలి


కుచ్చర్‌కల్‌లో వరి పంటలను పరిశీలిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు వీరబ్రహ్మచారి

రాజాపూర్: పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వీరబ్రహ్మచారి డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని కుచ్చర్‌కల్, రాయపల్లి గ్రామాల్లో వడగళ్ల వర్షంతో దెబ్బతిన్న పంటలు, కుచ్చర్‌కల్‌లో గాలివానకు రేకులు ఎగిరిపోయిన ఇళ్లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అకాల వడగళ్ల వర్షంతో పంటలు పూర్తిగా దెబ్బతింటే పట్టించుకోవడం లేదన్నారు. ఫసల్‌బీమా అమలు చేస్తే పంటనష్టం ఎకరాకు రూ.25వేలు వచ్చేవని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, మండల అధ్యక్షుడు కావలి రామకృష్ణ, జిల్లా అధికార ప్రతినిధి నర్సింహులు, అమర్‌రెడ్డి, బాలగౌడ్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా బీటీ రోడ్డు పనులు



దేవరకద్ర: పట్టణంలో ఆర్వోబీ పనులు పూర్తి చేసి ఈనెల చివరి వరకు ప్రారంభోత్సవం చేయాలనే లక్ష్యంతో పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈనెల 13న కలెక్టర్ రవినాయక్‌తో పాటు ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డిలు ఆర్వోబీ పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఈనెలాఖరు వరకు పనులన్నీ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. దీంతో ఆర్వోబీపై పెండింగ్‌లో ఉన్న బీటీ రోడ్డు పనులు శనివారం జోరుగా సాగాయి. రాయిచూర్ రోడ్డు వైపు నుంచి ఆర్వోబీపై బీటీ రోడ్డును వేశారు. ఆర్వోబీ అప్రోచ్ రోడ్డుపై సాయంత్రం వరకు బీటీ పనులు కొనసాగాయి. పనులను డీఈ సంధ్య, ఏఈ కౌషిక్‌లు పర్యవేక్షణ చేశారు. ఆర్వోబీ పొడవు అటు ఇటు కలిపి ఒక కిలోమీటరు మేర ఉండగా, అప్రోచ్ రోడ్డులు వాటికి అనుసంధానంగా ఉన్నాయి. బీటీ పనులు పూర్తి అయితే ఆర్వోబీపై వాహనాలు రాకపోకలు సాగించడానికి వీలవుతుంది. ఇక ఆర్వోబీ కింద ఉన్న సర్వీసు రోడ్లను పూర్తి చేయాల్సి ఉంటుంది. అలాగే ఫిల్లర్ల మధ్య గోడల నిర్మాణం, చెట్లను నాటడం వంటి పనులు చేపట్టాల్సి ఉంది.

సమ్మె నోటీసు అందజేత

జడ్చర్ల టౌన్: సమస్యలు పరిష్కరించకుంటే ఈనెల 28 నుంచి నిరవధిక సమ్మె చేపడుతామని శనివారం మండలంలోని 36మంది జూనియర్ పంచాయతీ కార్యదర్శులు ఎంపీడీఓ ఉమాదేవికి సమ్మె నోటీసు అందజేశారు. నాలుగేళ్ల కిందట విధుల్లోకి తీసుకున్న తమను రెగ్యులర్ చేయకపోవడాన్ని నిరసిస్తూ సమ్మె నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. నోటీసు అందజేసిన వారిలో సంఘం అధ్యక్షుడు వేణు, కార్యవర్గ సభ్యులు అభినాష్, స్వాతి, మౌనిక, రాఘవేందర్, విజయ్ ఉన్నారు.

గండేడ్: పంచాయతీ కార్యదర్శులను రెగ్యులరైజ్ చేయాలని శనివారం ఎంపీడీఓ రూపేందర్‌రెడ్డికి సమ్మె నోటీసు అందించారు. ప్రభుత్వం స్పందించి వెంటనే రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు.

